క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో వైఎస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ నిధులతో సోమవారం సీసీ రోడ్డు పనులు శ్రీకారం చుట్టారు. ఇటీవల వైఎస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్‌కు కూచిపూడి కళాపీఠం ఎంపికైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలను అభివృద్ధికి కేటాయించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణంరాజు పర్యవేక్షణలో 100 మీటర్ల పైగా నిడివి గల ఈ రహదారిని ఐదు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గుడివాడ టౌన్(నందివాడ): విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరాలు తగ్గుతాయని నందివాడ ఎస్‌ఐ ఎన్. చంటిబాబు అన్నారు. మంగళవారం నందివాడ మండలం తమిరిశ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ప్రభుత్వ నిబంధనలు, చట్టాలు, వాటి ప్రయోజనాలు, శిక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన దిశ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29వ తేదీన ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తొలుత మార్చి 1వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా కొన్ని అనివార్య కారణాలతో ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక



మొవ్వ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(డీఎంపీడీ)లో పాల్గొన్న మొవ్వ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు చేసిన అంశం రాష్ట్రా స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఆదివారం జరిగిన ఈ ప్రదర్శనల్లో జిల్లా నుంచి 300 అంశాలకు పైగా ప్రాజెక్టులు రాగా తమ పాఠశాల విద్యార్థులు వీర్ల శివనాగరాకేష్ బాబు, జి.శ్రీసాయి గోపి, వి.అంకవీర నాగమోహన్‌కుమార్ ప్రదర్శించిన ఏ టూల్ ఫర్ టైలర్స్ అనే అంశాన్ని ప్రదర్శించి, జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించినట్లు హెచ్‌ఎం సాంబశివరావు తెలిపారు. గైడ్ టీచర్ డి.వసంత్‌కుమార్‌ను, విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పామర్రు: కోరిన వారికి కొంగు బంగారమైన గంగానమ్మతల్లి జాతర మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని స్థానిక ఆలయం వద్ద నుంచి మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఘటం కుండకు ప్రత్యేక పూజలు చేసి చద్ది నివేదనలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు గడకు నూతన వస్త్రాలను సమర్పించి పసుపుకుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, సభ్యులు ఎస్.బాల సుబ్రమణ్యేశ్వరరెడ్డి, బి రాజశేఖర్‌రెడ్డి, జీ చంద్రశేఖరరెడ్డి, ఎం.అంజిరెడ్డి, బీ శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, డి.బాలవెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, సూరవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన



కైకలూరు: స్థానిక సీఎన్నార్ గార్డెన్ నుంచి దానిగూడెం కాల్వకు రూ.75 లక్షలతో చేపట్టనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ రఫీ, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, అచ్చిరాజు, కాంట్రాక్టర్ రవిచంద్ర, పంచాయతీరాజ్ డీఈ సురేష్, ఏఈ షాదిక్‌పాషా పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు

పేదలకు గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలు అందాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు గ్రామస్థాయిలో సులువుగా అందుతున్నాయి. ఈ సచివాలయాలకు సొంత భవనాలు సమకూరాయి.



మోటూరు సచివాలయం ప్రారంభోత్సవంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని (ఫైల్)

38 సచివాలయాల నిర్మాణానికి రూ.15.2 కోట్లు మంజూరు



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు 38 సచివాలయాలకు రూ.15.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించింది. గుడివాడ మండలానికి 9, నందివాడ 12, గుడ్లవల్లేరు మండలాలకు 17 సచివాలయాలను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 18 సచివాలయాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రజలకు సేవలందిస్తున్నాయి. మూడు మండలాల్లో సచివాలయాల్లో విధులు నిర్వహించే గ్రేడ్-5 సెక్రటరీ, డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫిషరీస్, వ్యవసాయ సహాయకులు, మహిళా పోలీస్, గ్రామ సర్వేయర్ తదితర పోస్టులకు సంబంధించి మొత్తం 328 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

అధునాతన సౌకర్యాలతో భవనాలు

సచివాలయ భవనాలను కార్పొరేట్ ఆఫీస్‌లను తలదన్నే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ఒక్కో భవనానికి రూ.40 లక్షలు ఖర్చు చేస్తోంది. గుడివాడ మండలంలో దొండపాడు, లింగవరం, మోటూరు, కల్వపూడి అగ్రహారం, మల్లాయపాలెం-2, బిళ్లపాడు, నందివాడ మండలంలో ఇలపర్రు, నందివాడ, పెదలింగాల, తుమ్మలపల్లి, రుద్రపాక, కుదరవల్లి, గుడ్లవల్లేరు మండలంలో అంగలూరు, చంద్రాల, గుడ్లవల్లేరు-1, గుడ్లవల్లేరు-2, వడ్లమన్నాడు, డోకిపర్రు-2 సచివాలయాలను ప్రారంభించారు. మిగిలిన ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి.



సేవలందిస్తున్న ఇలపర్రు గ్రామ సచివాలయం

అన్ని రకాల సేవలు అందుతున్నాయి



గతంలో ఏ పని కావాలన్నా మండలకేంద్రాలకు వెళ్లి కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాల్లోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గ్రామస్థాయిలో అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–పి.పద్మ, గుడివాడ

లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా కోరుకున్న లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం. నా చదువు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. సచివాలయ వ్యవస్థలో ఉద్యోగిగా ప్రజలకు సేవలందించడం గర్వంగా ఉంది.

–దారపురెడ్డి పృథ్వీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలివర్తిపాడు సచివాలయం

రైతులకు సత్వర సేవలు



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన దానికి అనుసంధానంగా రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామాల్లోనే రైతులకు సత్వర సేవలు అందుతున్నాయి. గతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నాం.

– చెదుర్తిపాటి ఆమోసు, వ్యవసాయ సహాయకులు, వలివర్తిపాడు సచివాలయం

సీఎం సభను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: పామర్రులో ఈనెల 29న జరగాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను మార్చి ఒకటో తేదీకి మార్చినట్లు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. సీఎం సభను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనను సీఎం చేతుల మీదగా విద్యార్థులకు అందించేందుకు నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్టంలో అర్హులైన విద్యార్థుల తల్లుల అకౌంట్‌లకు జగనన్న విద్యాదీవెన నగదుని సీఎం బటన్ నొక్కి జమ చేస్తారని చెప్పారు. మొదటిసారి సీఎం పామర్రు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. 40వేల మందితో సభ జరుగుతుందన్నారు. సభకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు ఏ విధమైనా ఇబ్బందులు లేకుండా వాహనాలు, భోజన వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, పాతూరి చంద్రపాల్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి కోటి గుడ్‌బై



విలేకరులతో మాట్లాడుతున్న కోటి

గుడివాడ టౌన్: తెలుగుదేశం పార్టీ ప్రాథమిక, క్రియాశీల సభ్యత్వాలకు రాజీనామా చేసినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకుడు దేవరపల్లి కోటి తెలిపారు. మంగళవారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాను ఓటు వచ్చిన నాటి నాటి నుంచి టీడీపీ జెండా మోశానని పేర్కొన్నారు. తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శిగా, పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పార్టీకి పలు సేవలు అందించామన్నారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముఖ అని చెబుతూనే ఆ పార్టీలో బీసీలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తున్నారని కోటి ఆరోపించారు. పార్టీలో కొత్తగా వచ్చిన కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారే ఆధిపత్యం వహిస్తూ పెత్తనాలు చేస్తున్నారే తప్ప బడుగువర్గాల నాయకులను కనీసం గుర్తించడం లేదన్నారు. గుర్తింపు లేని పార్టీలో కొనసాగడం ఇష్టంలేక టీడీపీని వీడుతున్నట్లు తెలిపారు.

నేడు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట



లేళ్లగరువులో పునఃనిర్మించిన రామాలయం



ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు: మండలంలోని లేళ్లగరువు గ్రామంలో చేపట్టి రామాలయం పునఃనిర్మాణ పనులు పూర్తయ్యాయి. బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట వైభవంగా జరగనుంది. గతంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో పునఃనిర్మాణ పనులు చేపట్టారు. దాతల సహకారంతో సుమారు రూ.కోటితో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. వేద పండితుడు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.08 గంటలకు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే సిద్ధంగా ఉన్న శ్రీ సీతారాముల విగ్రహాలతో పాటుగా లక్ష్మణ, హనుమాన్, గణపతి, దత్తాత్రేయ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవతా మూర్తుల ప్రతిష్టను పురస్కరించుకుని మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తబృందం తెలిపింది.

ఘనంగా ముగిసిన నాంచారమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

లక్ష్మీపురం(చల్లపల్లి): గ్రామంలో వేంచేసిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సహిత శ్రీలక్ష్మీ నాంచారమ్మ తల్లి ఆలయ 92వ వార్షిక ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రధాన అర్చకుడు స్వర్ణ శివ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ పూజలు జరిపించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు, గ్రామ ప్రముఖులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



గుడ్లవల్లేరు: మచిలీపట్నానికి చెందిన పేద విద్యార్థిని పెదప్రోలు మేఘన గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు బాడిగ శేషగిరిరావు, రామాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ రూ.15వేల సాయం చేశారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కరుణకుమార్‌కు ఆర్థిక సాయాన్ని కొండలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బాడిగ భాస్కరరావు చేతుల మీదుగా అందజేశారు.

అప్పాపురంలో డ్రెయినేజీ అభివృద్ధి పనులు

మండవల్లి: మండలంలోని అప్పాపురంలో మంగళవారం సర్పంచ్ బుర్ల భోగేశ్వరరావు డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డ్రెయిన్లు సక్రమంగా లేకుంటే ప్రజలకు అంటువ్యాధులు ఏర్పడి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కారణంగా గ్రామంలో పూర్తి స్థాయిలో డ్రెయిన్లను బాగుచేయించి ప్రజలకు ఎలాటి అనారోగ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మినుములో తెగుళ్లపై రైతులకు అవగాహన



గుడ్లవల్లేరు: మినుము పంటలో వచ్చిన తెగుళ్లపై వడ్లమన్నాడులో రైతులకు మంగళవారం మచిలీపట్నం నుంచి జిల్లా వనరుల కేంద్ర బృంద వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవగాహన కల్పించారు. మినుములో కాండం కుళ్లు, సీతాఫలం తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు మందుల పిచికారీపై వివరించారు. ఏడీఏలు కె.జ్యోతి రమణి, కె.శ్రీనివాసరరావు, ఏఓ బి.పద్మజ, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా సభ్యుడు పెన్నేరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడటౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను వివరించేందుకు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రాజేష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. డిపో మేనేజర్‌తో మాట్లాడదలచిన వారు 99592 25464ను సంప్రదించాలని ఆయన కోరారు.

నాగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.05 లక్షలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారికి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.5,05,916 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ సమక్షంలో మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో 16 నెలలకు వచ్చిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 96 గ్రాముల వెండి, గ్రాము బంగారం సమకూరింది.

రేపటి భవిష్యత్‌కు శ్రమిస్తున్న జగన్‌ను ఆశీర్వదించాలి



ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

మండవల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి రేపటి భవిష్యత్‌కు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. మండలంలోని పెనుమాకలంకలో మంగళవారం రూ.7 కోట్ల 80 లక్షల నిధులతో పెదయెడ్లగాడి నుంచి సిద్ధాంతం వరకు ఆర్ అండ్‌బీ రోడ్డును ఇంగిలిపాకలంక, నందిగామలంక, పెనుమాకలంక గ్రామాలకు లబ్ధి చేకూరేవిధంగా రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర ఎస్సీ నాయకులు బొడ్డు నోబుల్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, పెనుమాకలంక, నందిగామలంక సర్పంచ్‌లు ముంగర నాగరాజు, నేతల నాగరాజు, పార్టీ నాయకుడు మెండా సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు జి రాజా సత్యప్రసాద్, మాజీ అధ్యక్షుడు బి గోకర్ణయాదవ్, చాలిపాడు శ్రీను పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయాలి



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: పామర్రులో వచ్చే నెల ఒకటో తేదీన జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో మంగళవారం స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. పామర్రు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన నగదును తల్లుల ఖాతాలలో జమ చేయనున్నారని రాజామణి, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, వెలుగు పీడీ శివరామ్‌ప్రసాద్, ఈఓపీఆర్‌డీ నవరత్నం, కంకిపాడు ఏరియా కోఆర్డినేటర్ రంగారావు, ఏపీఎం జి. కృష్ణంరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హిమకుమారి, కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు



ఐలూరులో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



చోరగుడిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధవి తెలిపారు. మండలంలోని ఐలూరు ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 273 మందికి డాక్టర్ మాధవి, డాక్టర్ రోహిత్, డాక్టర్ పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, హెచ్‌వీ రోహిణి, ఎంపీహెచ్‌ఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

318 మందికి వైద్య పరీక్షలు

పమిడిముక్కల: మండలంలోని చోరగుడి హైస్కూల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి ప్రారంభించారు. వైద్యులు సైరా కతూన్, రేష్మా 318 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి పరీక్షలు చేశారు. సర్పంచ్ పూర్ణకుమారి, కార్యదర్శి రమణ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

కొవ్వాడలంకలో..

మండవల్లి: కొవ్వాడలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. ఏలూరుకు చెందిన డాక్టర్ నాగరాజు, డాక్టర్ దేవి, లోకుమూడి డాక్టర్ సుమ సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న, హెల్త్ సూపర్‌వైజర్ రహీమ్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



కలిదిండి: కలిదిండి శివారు పేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పి ప్రభాకరరావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో 132 మందికిగాను విద్యార్థులు 106మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించారు. సక్రమంగా హాజరుకాని విద్యార్థులను పాఠశాలకు రప్పించే ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యాసాగర్, కోక సురేష్, పాఠశాల ప్రగతి గురించి వివరించారు.

ఏఐటీయూసీ మహాసభలు జయప్రదం చేయండి



గుడివాడ టౌన్: ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో మహాసభల నిర్వాహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 27, 28 తేదీల్లో ఏఐటీయూసీ మహాసభలునిర్వహిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి వీరేంద్రనాథ్, నియోజకవర్గ కన్వీనర్ గూడపాటి ప్రకాష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు జి. శేషు, ప్రధాన కార్యదర్శి సీహెచ్. సత్యన్నారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.రేణు శివకుమార్, డి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా



మండవల్లి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భైరవపట్నం, పెరికెగూడెం గ్రామాల్లో మంగళవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెచ్‌ఐవీ నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ కేంద్రం ఏర్పాటు చేసిన ఐసీటీసీ సెంటర్లలో రక్త పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే సీడీ ఫోర్ కౌంట్‌తో సంబంధం లేకుండా ఏఆర్టీ వాడాలన్నారు. వీధి నాటికల ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు ఎం.శేఖర్‌బాబు, వై.వీరయ్య, వై.రవితేజ, ఎం.చిరంజీవి, ఎం.ప్రసాద్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి కి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య పర్యవేక్షించారు.